సాక్షి ప్రకాశం

గురువారం । 21 । డిసెంబర్ । 2023



పేదల చదువుకు డిజిటల్ ట్యాబ్‌లెట్!

కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ బోధనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 21,617 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించనున్నారు. - 8లో..



బడుగుల గుండె చప్పుడు సీఎం జగన్

బడుగు బలహీన వర్గాల గుండె చప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
22/29

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. దట్టమైన పొగమంచు కురుస్తుంది. తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

● కలెక్టర్ దినేష్ కుమార్



విద్యుత్ పొదుపు వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సబర్బన్: విద్యుత్‌ను పొదుపుగా వాడటం మనందరి బాధ్యతగా గుర్తించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఒంగోలులో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాంనగర్‌లోని విద్యుత్ భవన్ వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ విద్యుత్ భవన్ నుంచి ప్రారంభమై నెల్లూరు బస్టాండ్ మీదుగా చర్చి సెంటర్ వరకు సాగింది. చర్చి సెంటర్‌లో విద్యుత్ ఉద్యోగులు, ప్రజలు మానవహారంగా ఏర్పడ్డారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో సాంప్రదాయేతర ఇంధన వినియోగం పెరగాలన్నారు. ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు భవిష్యత్ తరాలకు ఆస్తిని కూడబెట్టినట్లేనన్నారు. విద్యుత్ పొదుపు ద్వారా డబ్బులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఈఈ కె.శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు డీఈ వినయ్ కుమార్ రెడ్డి, మోహనరావు, ఏఈఈలు డి.వెంకటేశ్వర్లు, శివ ప్రసాదు పాల్గొన్నారు.


రేపు అండర్ 19 షూటింగ్ బాల్ సెలక్షన్స్

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 షూటింగ్ బాల్ సెలక్షన్స్ ఈ నెల 22న నిర్వహించనున్నట్లు అండర్ 19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆదినారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎంపిక జరుగుతుందన్నారు. 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని, వివరాలకు 9949722791 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రూప్-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకురాలు ఎం అంజలి తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 60 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 50 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9989285530, 8985090926 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో వెనకబడిన జిల్లాను అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సంక్షేమ పథకాలు.. అభివృద్ధి పనులతో జిల్లా ప్రకాశిస్తోంది. జిల్లాలోని మారుమూల గిరిజన తండాలకు సైతం ప్రభుత్వ పథకాలు అందేలా చేశారు. గత తెలుగుదేశ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వెలిగొండ ప్రాజెక్టుకు వందలాది కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడమే కాకుండా తుఫాన్లు వంటి కష్టకాలంలో అండగా ఉంటూ పరిహారాన్ని అందిస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా అత్యాధునిక సేవలను అందుబాటులో తెచ్చారు. పశ్చిమాన ఎవరైనా అనారోగ్యం బారిన పడితే మెరుగైన వైద్యానికి సుదూర ప్రాంతాలకు పరుగులెత్తాల్సిన పరిస్థితి. ఈ ప్రాంతానికి గుండెకాయ లాంటి మార్కాపురంలో జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేయడమే కాకుండా మెడికల్ కళాశాల మంజూరు చేశారు. రానున్న రోజుల్లో మెడికల్ హబ్‌గా మారనుంది. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయి.



పంచవర్ష.. ప్రగతి చిహ్నాలు

- నాడు-నేడు ద్వారా **1992** పాఠశాలల అభివృద్ధికి రూ.**369.16** కోట్లు
- **591** సచివాలయాలకు రూ.**226** కోట్లు
- **593** ఆర్‌బీకేలకు రూ. **129.27** కోట్లు
- **492** వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు రూ.**861** కోట్లు
- **228** డిజిటల్ లైబ్రరీలకు రూ.**364** కోట్లు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రకాశించిన జిల్లా
- జిల్లాలో వేల కోట్లతో అభివృద్ధి..సంక్షేమం
- గత ప్రభుత్వంలో పడకేసిన జిల్లా అభివృద్ధి
- జిల్లాకు రిమ్స్‌ను దివంగత నేత అందిస్తే.. అభివృద్ధి చేసిన తనయుడు
- విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- మార్కాపురం మెడికల్ కాలేజికి రూ.475కోట్లు
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు
- సచివాలయాల ద్వారా 9 వేల మందికి ఉద్యోగాలు
- పారదర్శకంగా లబ్ధిదారులకే నేరుగా నగదు అందజేత

ఒంగోలు అర్బన్:

ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకూ వైఎస్సార్ సీపీ జైత్రయాత్రను కొనసాగించింది. జిల్లా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి ఎన్నికష్టాలు వచ్చినా ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నవరత్నాల ద్వారా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే వేలకోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆయా రంగాలు అభివృద్ధి చేసి ప్రజలకు ఉపకరించేలా చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమయింది. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీల సైతం నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతుంది. వైఎస్సార్ సీపీ హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి ఇలా..

ప్రజల చెంతకే..

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముందుకు తీసుకొచ్చారు. అన్ని సంక్షేమ పథకాల అమలును అత్యంత పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోంది. ఈ వ్యవస్థ ద్వారా జిల్లాలలో సుమారు 9 వేల మందికి ఉద్యోగాలు లభించాయి. ఇప్పటి వరకు 40,56,881 సేవలు వివిధ శాఖలకు సంబంధించి ప్రజలకు అందాయి. జిల్లాలో 591 భవనాలు మంజూరు కాగా వాటి నిర్మాణానికి రూ.226.20 కోట్లు కేటాయించారు. ఇప్పటికి జిల్లాలో 411 భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

రూ.369.16 కోట్లతో 1174 పాఠశాలల ఆధునికీకరణ

నాడు–నేడు పథకం కింద జిల్లాలో రెండు దశల్లో కలిపి 1174 ప్రభుత్వ పాఠశాలలు రూ.369.16 కోట్లతో మరమ్మతులు, నూతన నిర్మాణాలతో ఆధునికీకరించారు. మొదటి దశలో 1015 పాఠశాలలు రూ.209.42 కోట్లు, రెండో దశలో 977 పాఠశాలలు రూ.159.74 కోట్లతో ఆధునికీకరణ చేశారు.

నాలుగేళ్లలో ఇరిగేషన్‌కు రూ.2,127.95 లక్షల కేటాయింపు

జిల్లాలో ఇరిగేషన్ శాఖలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. గడిచిన నాలుగేళ్లలో రూ.2127.95 లక్షలు (212.7 కోట్లు పైగా) కేటాయించారు.

సంక్షేమ ఫలాలు

వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద జిల్లాలో 2,80,452 మందికి ప్రతి నెలా రూ.78 కోట్లు అందజేస్తున్నారు. వసతి దీవెన పథకం కింద 12,341 మంది ఎస్సీ ఏడాదికి రూ.11 కోట్లకు పైగా అందిస్తూ ఇప్పటి వరకు రూ.35.10 కోట్లు మూడు దఫాలుగా అందజేశారు. అదేవిధంగా 1103 మంది ఎస్టీలకు రూ.4 కోట్లు ఆర్థిక సహాయం అందజేశారు. రైతు భరోసా పథకం ద్వారా గరిష్టంగా 2,84,113 మంది రైతులకు ఏడాదికి రూ.15 వేలు అందిస్తున్నారు. మత్స్యకార భరోసా కింద 5260 మంది మత్స్యకారులకు ఏడాదికి రూ.5.26 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జిల్లాలో 3,08,052 మంది లబ్ధిదారులకు రూ.908 కోట్ల ఆర్థిక సహాయం ఇప్పటి వరకు అందజేశారు. అమ్మఒడి పథకం కింద 2,03,623 మంది తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.101.81 కోట్లు జమ చేస్తున్నారు. వీటితో పాటు అనేక పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఆదుకుంటూ జీవితంలో అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు.

2019-20 సంవత్సరానికి రూ.1578.87 లక్షలు, 2020–21లో రూ.95.77 లక్షలు, 2021–22 సంవత్సరంలో 195.65 లక్షలు, 2022–23 సంవత్సరంలో రూ.257.66 లక్షలు కేటాయించారు. ఇందులో ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టు పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయి. కొత్త సంవత్సరంలో దీనిని ప్రారంభించనున్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీకి రూ.475 కోట్లు

వైద్య రంగానికి పశ్చిమ ప్రకాశం మెడికల్ హబ్‌గా మారనుంది. జిల్లాలో రెండో మెడికల్ కాలేజీ మార్కాపురంలో ఏర్పాటు చేయడమే కాకుండా పాటు నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించారు. దానిలో ఇప్పటికే సుమారు రూ.30 కోట్లకు పైగా మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. అదే విధంగా జిల్లాలో 492 విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలకు రూ.861 కోట్లు కేటాయించి ఇప్పటికే 226 భవనాలు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి వందల కోట్లు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇవేకాకుండా అత్యాధునిక యంత్ర పరికరాలు కలిగిన 108, 104, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్య సేవలను సైతం ఉచితంగా అందిస్తున్నారు.

నీటి పారుదల శాఖకు రూ.2127.95 లక్షలు కేటాయింపు

జిల్లాలో ఇరిగేషన్ శాఖలో పలు అభివృద్ధి పనులకు గడిచిన నాలుగేళ్లలో రూ.2127.95 లక్షలు (212.7 కోట్లు పైగా) కేటాయించారు. 2019–20 సంవత్సరానికి రూ.1578.87లక్షలు, 2020–21లో రూ.95.77 లక్షలు, 2021–22 సంవత్సరంలో 195.65 లక్షలు, 2022–23 సంవత్సరంలో రూ.257.66 లక్షలు కేటాయించారు.

పేదలకు వైద్యం చేరువ చేయడంలో ప్రత్యేక కార్యాచరణ

పేదలకు వైద్యం చేరువ చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణకు శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేస్తోంది. 104, 108, తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ వంటి వాహన వైద్య సేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్ష, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వంటి కార్యక్రమాలతో గ్రామాల్లోకి వైద్య సేవలను విస్తరించారు. వైద్య రంగంలో వైద్యుల నుంచి పారా మెడికల్ సిబ్బంది వరకు కొరత లేకుండా పోస్టులను భర్తీ చేయడమే కాకుండా ఆస్పత్రులను నాడు–నేడు కింద ఆధునికీకరించి అవసరమైన యంత్ర పరికరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది.

రూ. కోట్లతో రిమ్స్ అభివృద్ధి

జిల్లాకు రిమ్స్ ఆస్పత్రిని ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారు. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధి అటకెక్కింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.కోట్లు వెచ్చించి అత్యాధునిక పరికరాలతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తెచ్చారు. మెడికల్ కాలేజీకి సైతం 65 పీజీ సీట్లు మంజూరు చేశారు. జీజీహెచ్‌లో మరమ్మతులు, ఆధునికీకరణ, అభివృద్ధి, నిర్మాణ పనులకు సుమారు రూ.25 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో పీజీ విద్యార్థుల క్వార్టర్స్ నిర్మాణాలు, 4 లెక్చరర్ గ్యాలరీలు, 2 పరీక్షా కేంద్రాలు, ఫార్మసీ సెంట్రల్ స్టోర్ తదితర నిర్మాణాలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన జీజీహెచ్ ఆడిటోరియం సైతం రూ.3.5కోట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చింది. రూ.2 కోట్లతో 100 పడకల ఐసీయూ కాంప్లెక్స్, మరో రూ.2 కోట్లతో 100 ఆక్సిజన్ బెడ్లతో కోవిడ్ ప్రత్యేక గదులు, రూ.7.5 కోట్లతో ఎంఆర్ఐ, రూ.2.5 కోట్లతో సిటీ స్కాన్ యంత్రాలు ఇంకా మరెన్నో పనులు చేపట్టింది.

అన్నదాతలకు

రైతులకు సకాలంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందచేయడమే కాకుండా ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు విశిష్ట సేవలు అందించడంలో ప్రభుత్వం సఫలమైంది. రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి జిల్లాకు 593 భవనాలు మంజూరు కాగా రూ.129.27 కోట్లు కేటాయించారు. వీటిలో 367 భవనాలు 63.27 శాతం పూర్తయ్యాయి. గిద్దలూరు, సింగరాయకొండలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మించారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

పేద విద్యార్థుల ఉన్నత చదువులు సాకారం

- జగనన్న విదేశీ విద్యా దీవెనతో పేదలకు ఉన్నత విద్య
- జిల్లాలో విదేశీ విద్య కింద 13 మంది పేద విద్యార్థులకు రూ.1.13 కోట్లు అందజేత
- కలెక్టర్ దినేష్‌కుమార్



విద్యార్థులకు విదేశీ విద్య చెక్కు అందజేస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: జగనన్న విదేశీవిద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాలతో పేద కుటుంబాల్లోని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాలకు సంబంధించి ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు పాల్గొని లబ్ధిదారులకు బ్యాంకు చెక్కు అందచేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాలో విదేశీ విద్యా దీవెన పథకం కింద 2022–23 ఏడాదికి 11 మంది, 2023–24 సంవత్సరానికి ఇద్దరు ఉన్నారని, వీరందరికీ కలిపి రూ.1,13,13,152 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. క్యూస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్ ప్రకారం ఇంజినీరింగ్, మెడిసిన్, లా, జర్నలిజం వంటి 21 ఫ్యాకల్టీల్లో టాప్ 50 ర్యాంకులో ఉన్న కళాశాలల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25కోట్లు, ఇతర విద్యార్థులకు రూ.కోటి వకు పూర్తి రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా విదేశాల్లో టాప్ యూనివర్శిటీల్లో విద్య అభ్యసించడం కష్టంగా ఉండేదని, ఈ పథకం ద్వారా ఎంతో మంది విద్యార్థులు వారి కలలను సాకారం చేసుకునే అవకాశం కలిగిందన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకం కింద జిల్లాలో 2023–24 సంవత్సరానికి ఐదుగురు విద్యార్థులు అర్హత పొందినట్లు తెలిపారు. వారిలో ముగ్గురు ఈబీసీలు ఉన్నట్లు తెలిపారు. సివిల్స్ ప్రిలిమనరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఐదుగురికి రూ.లక్ష, మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఇద్దరికి అదనంగా మరో రూ.50వేలు కలిపి మొత్తం రూ.6 లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి పరిమితులు లేకుండా అభ్యర్థులు ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు ఉత్తీర్ణులైన ప్రతిసారి నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి సురేష్, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను. నా తండ్రి మరణించడంతో ఉన్నత విద్యకు బ్రేక్ పడింది. విదేశాల్లో యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఎంఎస్ చేయాలనే ఆశయాన్ని వదులుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో నా ఆశయం, కలలు సాకారం అవుతున్నందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి కల్పిస్తున్న ఈ అవకాశంతో పేద విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు దోహదపడుతుంది.

– చంద్రకాంత్‌రెడ్డి, లబ్ధిదారుడు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందాలి

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి
- జిల్లా ఎన్నికల పరిశీలకుడు పోలా భాస్కర్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు పోలా భాస్కర్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించకుండా పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన ప్రకాశంభవనంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. క్లెయిమ్‌లను బీఎల్‌ఓలు పరిష్కరిస్తున్న విధానాన్ని ఈఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిష్కార ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు ఏమాత్రం ఉల్లఘించకూడదన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారంలో నాణ్యత ఉండాలన్నారు. ఓటర్ల జాబితా, గుర్తింపు కార్డుల్లో ఫొటోలు స్పష్టంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తే ఎన్నికల సమయంలో ఎటాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటి నుంచే దృష్టి సారించవచ్చని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ కోసం ప్రతి వారం తమతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి కలెక్టర్ తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలా భాస్కర్‌కు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రసూల్, సత్యనారాయణ, రఘురాం, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు వెలిగండ్లలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: వెలిగండ్ల మండల కేంద్రంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వెలిగండ్ల తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న స్పందనకు జిల్లా యంత్రాంగం హాజరవుతుందని పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఈ నెల 29వ తేదీన పెద్దారవీడు మండలంలో కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా ఖాశిం



ఎస్పీ మలికా గర్గ్‌కు మొక్క అందిస్తున్న ఏఆర్ ఇన్‌స్పెక్టర్ ఖాశిం

ఒంగోలు సబర్బన్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కే ఖాశిం నియమితులయ్యారు. బుధవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను బహూకరించారు. ఎస్‌కే.ఖాశిం గతంలో ఒంగోలులో ఏఆర్ ఎస్సైగా, ట్రాఫిక్‌లోనూ విధులు నిర్వర్తించారు.

కరోనాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మార్కాపురం జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి



డాక్టర్ సుబ్బారెడ్డి

మార్కాపురం: కేరళలో వెలుగుచూసిన కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాలలో 20 బెడ్లలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒక లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, మరో రెండు ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయని, 150 పెద్ద ఆక్సిజన్ సిలిండర్లు, 102 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌తో ఏకకాలంలో 80 మందికి ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు చేశామన్నారు. టెస్టుల కోసం అవసరమైతే వీఆర్‌డీఎల్ ల్యాబ్ ప్రారంభిస్తామని, 30 ర్యాపిడ్ టెస్ట్ కిట్లు, పీపీఈ కిట్లు, మాస్కులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉంటూ జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు ధరిస్తూ తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలుంటే పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలన్నారు.

పేదల చదువుకు డిజిటల్ ట్యాబ్‌లెట్!

- నేడు 8వ తరగతి విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ కానుక
- జిల్లాకు చేరిన 21,617 ట్యాబ్‌లు
- గత ఏడాది కంటే మెరుగైన సామర్థ్యం
- ఏఐ యాప్‌తో సందేహాలు పరిష్కరించుకునే సౌలభ్యం
- డిజిటల్ బోధనకు 496 పాఠశాలలకు 1366 ఐఎఫ్‌పీ, 681 స్మార్ట్ టీవీలు
- నేడు స్పందన కాన్ఫరెన్స్‌లో ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల పంపిణీ

ఒంగోలు: పేదరికాన్ని రూపుమాపడం విద్యతోనే సాధ్యమన్న విద్యావేత్తల ఆలోచనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేసి చూపుతున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రక్షాళన చేస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలు ఇప్పటికే సత్ఫలితాలనిచ్చాయి. మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ బోధనకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు గత ఏడాది ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం విద్యార్థులకు ట్యాబ్‌లు, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ), ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలు అందజేసేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని ఒంగోలు కలెక్టరేట్ స్పందన కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రపంచంతో పోటీ పడాలని..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు పైచదువుల్లో వెనుకబడటానికి గల కారణాలపై అధ్యయనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధనను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే గత ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. 8.7 అంగుళాల స్క్రీన్, 3 జీబీ ర్యామ్, 64 జీబీ మెమరీతో కూడిన ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్‌ను పొందుపరిచి 8వ తరగతి విద్యార్థులు, అలాగే ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ ఏడాది ఉపాధ్యాయులను మినహాయించి 8వ తరగతి విద్యార్థులకు మాత్రమే ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 21,617 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించనున్నారు. ఈ ఏడాది ట్యాబ్‌లను పరిశీలిస్తే అదనంగా 256 ఎస్‌డీ కార్డు ఇచ్చి, ఒకే దఫా 8, 9, 10వ తరగతి కంటెంట్‌ను పొందుపరిచారు. ట్యాబ్‌ల పంపిణీ ప్రక్రియ గురువారం నుంచి 28వ తేదీ వరకు కొనసాగనుంది.



నాడు నేడు రెండో దశ పాఠశాలలకు ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు

నాడు నేడు మొదటి దశ పూర్తయిన పాఠశాలలకు గత ఏడాది ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు అందించారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 60 మంది విద్యార్థులకు ఒక టీవీ చొప్పున పంపిణీ చేశారు. 6 నుంచి 10 వ తరగతి వరకు ప్రతి సెక్షన్‌కు ఒక ఐఎఫ్‌పీ అందించి బైజూస్ కంటెంట్‌ను బోధించేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నాడు-నేడు రెండో దశ పనులు పూర్తయిన పాఠశాలలకు ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలను ప్రభుత్వం మంజూరు చేసింది. కాలేజీలకు 132 ఐఎఫ్‌పీలు, 12వ తరగతి వరకు ఉన్న పాఠశాలలకు 92 ఐఎఫ్‌పీలు, 6 స్మార్ట్ టీవీలు, మిగిలిన పాఠశాలలకు 1139 ఐఎఫ్‌పీలు, 681 స్మార్ట్ టీవీలు పంపిణీ చేయనున్నారు.

పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాల్లో ఊహించని మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థుల అవసరాలను గుర్తించి విద్యాభివృద్ధి చర్యలు చేపడుతోంది. జిల్లా కేంద్రానికి చేరిన ట్యాబ్‌లను ఇప్పటికే మండలాల వారీగా పంపిణీ చేశాం. ట్యాబ్‌ల్లో ఈ ఏడాది స్విఫ్ట్ చాట్‌యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థి తన ట్యాబ్ సీరియల్ నంబర్‌తో ఎన్నిసార్లయినా సందేహాలను నివృత్తి చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది.

– వీఎస్ సుబ్బారావు, డీఈఓ

నాణ్యతతో కూడిన ట్యాబ్‌లు పంపిణీ



రాష్ట్ర ప్రభుత్వం నాణ్యతతో కూడిన బ్రాండెండ్ ట్యాబ్‌లను విద్యార్థులకు అందిస్తోంది. జిల్లాలో గురువారం 21,617 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, ఓటీజీ కేబుల్స్, స్క్రీన్ గార్డులు, పౌచ్‌లు, జగనన్న నవరత్నాల స్టిక్కర్లను పంపిణీ చేయనున్నాం. అదే విధంగా పాఠశాలలకు 1366 ఐఎఫ్‌పీలు, 687 స్మార్ట్ టీవీలను అందిస్తున్నాం. ఎవరైనా ట్యాబ్‌ను ట్యాంపర్ చేస్తే ఐటీ సెల్‌కు అలర్ట్ వెళ్తుంది. ఆ మరుక్షణమే దానిని నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులు పాఠ్యాంశాలను ఇంటి వద్ద కూడా వీక్షించడానికి అవకాశం ఉంది.

– అశోక్‌బాబు, నోడల్ అధికారి

బడుగుల గుండె చప్పుడు సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బలహీన వర్గాలకు సముచిత స్థానం
- ఎల్లో మీడియా టీడీపీకి జాకీలేస్తున్నా ప్రజల్లో స్పందన శూన్యం
- కనిగిరి ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవంలో మున్సిపల్ శాఖా మంత్రి సురేష్
- ఐక్యమత్యంతో పనిచేద్దామని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బుర్రా పిలుపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్, సభ్యులు, వేదికపై మంత్రి సురేష్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ తదితరులు

కనిగిరి రూరల్: బడుగు బలహీన వర్గాల గుండె చప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, వైస్ చైర్మన్ చాంద్ బాషా, డైరెక్టర్ల కమిటీ ప్రమాణ స్వీకార సన్మాన సభ అట్టహాసంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగులకు రాజ్యాధికారం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకునే చంద్రబాబును నమ్మొద్దని ప్రజలకు సూచించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల మార్పుపై ఎల్లో మీడియా రాతలను మంత్రి సురేష్ తూర్పారబట్టారు. చంద్రబాబు, బాలకృష్ణ తమ సొంత నియోజకవర్గాల్లో కాకుండా కుప్పం, హిందూపురంలో ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబును అందలం ఎక్కించడం కోసం ఈనాడు, దాని తోకపత్రిక, ఎల్లో చానళ్లు టీడీపీకి జాకీలు పెట్టి లేపుతున్నాయని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌తోనే బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమన్నారు. సామాజిక సాధికారతలో భాగంగానే దళిత బిడ్డకు కనిగిరి ఏఎంసీ చైర్మన్ పదవి లభించిందన్నారు. ఎన్నికల సమయం కావడంతో టీడీపీ నేతలు గ్రామాల్లోకి వస్తున్నారని, 14 ఏళ్ల పాలనలో పేదలకు ఏం చేశారో నిలదీయాలని పిలుపునిచ్చారు. ఐక్యమత్యంతో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఏఎంసీ నూతన చైర్మన్ సాల్మన్ రాజు మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. సీఎం ఆశీస్సులు, ఎమ్మెల్యే బుర్రా కృషితో దళితుడినైన తనకు పదవి వచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో చేసిన మేలును గ్రామాల్లో తిరిగి వివరిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తొలుత వేదికపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ జ్యోతి ప్రజ్వళన చేసి సన్మాన సభను ప్రారంభించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్-1 పులి శాంతి, వైస్ చైర్మన్-2 మాణిక్యరావు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, గాయం సావిత్రి, గంగసాని లక్ష్మీరెడ్డి, మూడమంచు వెంకటేశ్వర్లు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, వాసవి సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు చప్పిడి సుబ్బయ్య, మేకల శ్రీను, ఓకేరెడ్డి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, ఎస్‌కే బుజ్జి, కాకర్ల వెంకటేశ్వర్లు, ఎస్‌కే జిలాని, గజ్జల వెంకటరెడ్డి, తాతపుడి మేరి పుష్పా, సంగు బ్బారెడ్డి, పువ్వాడి రాంబాబు, తమ్మినేని సుజాత, శ్రీరాం సతీష్, ఈర్ల రామాజంనేయులు, పందిటి వెంగళరావు, గుంటగాని పేతురు, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు, డైరక్టర్లు దాదా లక్ష్మీకుమారి, కుప్పనబోయిన పద్మావతి, పెన్నా వెంకటేశ్వర్లు, శిగ ఆదిలక్ష్మి, చెరుకూరి విజయలక్ష్మి, మెడబలిమి గురవయ్య, వివిధ దళిత సంఘాల నాయకులు, పాస్టర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

- జిల్లా సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్



మాట్లాడుతున్న లక్ష్మానాయక్

మార్కాపురం: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎన్.లక్ష్మానాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని, పాఠ్యాంశాలను సమగ్రంగా చదివి గుర్తుంచుకోవాలని చెప్పారు. డవైఈఓ చంద్రమౌళీశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తెలివితేటలను చదువుకు ఉపయోగించాలని, ఇతర అంశాలపై దృష్టి పెట్టవద్దని సూచించారు. ఎంపీడీఓ చందన, ఏఎస్‌డబ్ల్యూఓ అరుణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు జి.వెంకటేశ్వరరెడ్డి, వి.లక్ష్మీనాయక్, వై.రామయ్య, శ్రీరాం, డి.శ్రీను, యాసిన్‌బేగం, మహాలక్ష్మి, కాశిరత్నం, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

- గిరిజనుల ఉన్నతికి సీఎం జగన్ కృషి
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



మోపాడు రిజర్వాయర్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న శంకర్‌నాయక్

పామూరు: విద్యతోనే పేదరిక నిర్మూలన, సమసమాజాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ పేర్కొన్నారు. పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను బుధవారం జిల్లా అధికారులు, స్థానిక ఎస్టీ కాలనీవాసులు, బెస్త నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక గంగమ్మ దేవస్థానం వద్ద గిరిజన నాయకులు పేరం సత్యం అధ్యక్షతన జాలర్లు, యానాది కాలనీవాసులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ.. ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలని సూచించారు. విద్య లేకపోవడం వల్లే ఎస్టీలు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను బలిచేయవద్దని హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గిరిజనుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు.

ఫిషరీస్ కమిటీలో సభ్యత్వాలు చేపట్టాలి

మోపాడు రిజర్వాయర్ పరిధిలోని నుచ్చుపాద ఫిషర్‌మెన్ సొసైటీలో ప్రస్తుతం ఉన్న 40 సభ్యులతోపాటు అవకాశం ఉన్న మరో 300 మందికి పైగా బెస్త, యానాదులకు సభ్యత్వం కల్పించాలని ఫిషరీస్ జేడీ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు నైపుణ్య పరీక్షలు నిర్వహించి సొసైటీలో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం వగ్గంపల్లె గ్రామంలో ఎస్టీలు సాగుచేసుకుంటున్న భూమిని పరిశీలించారు. సాగుభూమికి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేయగా సమస్య పరిష్కరించాలని ఆర్డీఓ ఇర్విన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఫిషరీస్ జేడీ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈఈ బి.రవి, ఫిషరీస్ ఏడీ ఎ.ఉషాకిరణ్, తహసీల్దార్ ఆవుల సురేష్, ఏఐఎఫ్ షేక్.మహ్మద్ సుబాని, పి.శ్రీనివాసరెడ్డి, సంఘం నాయకులు పి.లక్ష్మినారాయణ, ఏటీడబ్ల్యూ సుబ్బయ్య, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసులు, సంఘ నాయకుడు ఓగూరి ఏడుకొండలు, జాలరులు, గిరిజనులు పాల్గొన్నారు.

కౌశల్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



కౌశల్ పోటీలలో సర్టిఫికెట్లు అందుకుంటున్న చిన్నారులు

ఒంగోలు: కౌశల్ జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీలు బుధవారం రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా ముగిశాయి. భారతీయ విజ్ఞాన మండలి, ఆప్కాస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 219 పాఠశాలల నుంచి 5500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్, పోస్టర్ ప్రెజంటేషన్ జనరల్, ఆవిష్కరణ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథి, ఏకేవీకే పాఠశాల కరస్పాండెంట్ మండవ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారతీయ పురాతన విజ్ఞాన విధానాలను వివరించారు. రైజ్ కాలేజీ డైరెక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల పురోగతికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. డీఈవో వీఎస్ సుబ్బారావు మాట్లాడతూ.. మొదటి రెండు స్థానాలలో ఎంపికైన టీములు, విద్యార్థులు ఈనెల 30న విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రైజ్ కాలేజీ ప్రిన్సిపాల్ కేవీ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

క్విజ్ విభాగంలో..

కొండపి మండలం కె.ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్, కొండపి ఎంజేపీ ఏపీబీసీఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, గిద్దలూరు మండలం కేఎస్‌పల్లి జెడ్పీ హైస్కూల్

పోస్టర్ ప్రజెంటేషన్‌లో..

జనరల్ థీమ్‌లో.. బి.మోక్షయాని-మార్కాపురం జెడ్పీ బాలికోన్నతపాఠశాల, ఎస్‌కే జాస్మిన్-సింగరాయకొండ జడ్పీ బాలికల పాఠశాల, ఎం.సుశీల్‌కుమార్-నాగులుప్పలపాడు జెడ్పీహెచ్ఎస్, అలాగే ఆవిష్కరణల విభాగంలో.. వైవీటి చంద్రిక-మార్కాపురం బాలికోన్నత పాఠశాల, పీవీ భార్గవి-ఆలకూరపాడు జెడ్పీహెచ్ఎస్, సీహెచ్ కౌషిక-బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

గిరిజన విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఐటీడీఏ పీవో రవీంద్రరెడ్డి
- వైపాలెంలో ఉత్సాహంగా థర్డ్ జోన్ గిరిజన క్రీడా పోటీలు



క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో రవీంద్రరెడ్డి

యర్రగొండపాలెం: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ మేరకు అరకులో గిరిజన క్రీడా పాఠశాలను ప్రారంభించారని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మాచర్ల రోడ్డులోని గిరిజన గురుకుల పాఠశాలలో థర్డ్ జోన్ గిరిజన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ.. చదువులో, క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 17 పాఠశాలల నుంచి 1200 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పి.జగన్నాథరావు, ఓఎస్‌డీ ఎస్.శ్యాంసుందరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ ఏకుల జయమ్మ ముసలారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఎంపీటీసీ మంగ్లిబాయి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పి.సలాంఖాన్, శామ్యూల్ జోబ్, మోహన్, వెంకటేశ్వర్లు నాయక్, శివరామకృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో సీహెచ్ మధుకుమార్(నాగార్జున సాగర్) ప్రథమ, కె.వీరయ్య(యర్రగొండపాలెం) ద్వితీయ, బి.సాయినాయక్(దోర్నాల) తృతీయ స్థానాల్లో నిలిచారు. జావెలిన్‌త్రోలో వి.నాగేంద్ర నాయక్(గిద్దలూరు),ఆర్.వాసు(చిట్టేడు),ఇ.మహేష్(చిట్టేడు), షాట్‌పుట్ బాలికల విభాగంలో ఐ.గీతిక(చీరాల), కె.శ్రీవల్లి(నెల్లూరు), ఎంజీ దీప్తి(నరసరావుపేట), లాంగ్‌జంప్ బాలికల విభాగంలో హర్షిణి(కారంపూడి), ఐ.హారతి(కరేడు), ఎం.విజయలక్ష్మి(పిడుగురాళ్ల), లాంగ్‌జంప్ బాలుర విభాగంలో ఇ.మహేష్(చిట్టేడు), సునోద్ నాయక్(అద్దంకి), టి.ముత్యాలయ్య(చిట్టేడు), బాలికల 800 మీటర్ల పరుగు పందెంలో బి.గంగోత్రి(కారంపూడి), ఆర్.పవిత్ర(కారంపూడి), జి.నీరజ(గిద్దలూరు) వరుస మూడు స్థానాల్లో సత్తా చాటారు.